క్లుప్తంగా

విలేకరి వైద్యానికి ఆర్థిక సాయం



విలేకరి ఆనంద్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న కంబాల శ్రీనివాసరావు

గోకవరం: గ్రామానికి చెందిన బాతు ఆనంద్ ఓ దినపత్రికలో విలేకరిగా పని చేస్తున్నాడు. అతనికి ముక్కు నుంచి రక్తం కారడంతో శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు సూచించారు. ఇందుకు రూ.50 వేలు వరకు ఖర్చవుతుందని తెలిపారు. విషయం తెలుసుకున్న విశ్వహిందూ పరిషత్ ధర్మపరిరక్షణ రామసేన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్‌రావు రూ.10 వేలు, గోకవరం ప్రెస్‌క్లబ్ సభ్యులు రూ.14 వేలు ఆర్థిక సహాయంగా అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొండరాజులబాబు తీర్థం



రమణయ్యపేటలో కొండరాజులబాబును దర్శించుకుంటున్న భక్తులు

ఏలేశ్వరం: మండలంలోని రమణయ్యపేటలో కొండరాజులబాబు తీర్థ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఉత్సవాల్లో చివరి ఆదివారం కావడంతో స్వామివారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. ఆలయ ప్రాంగణంలో వివిధ దుకాణాలు ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

6న రాజశేఖరస్వామి కల్యాణం

కొత్తపల్లి: స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత రాజశేఖరస్వామివారి కల్యాణం ఈ నెల 6వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు శర్మ, సుబ్రహ్మణ్యం ఆదివారం తెలిపారు. స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా ప్రతిరోజు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. 6న తేదీ ఉదయం గ్రామోత్సవం, రాత్రి 7 గంటలకు స్వామివారి కల్యాణం, 7న స్వామివారికి లలితా పారాయణ, ఆలయం వద్ద ముగ్గుల పోటీలు, 8న మహాశివరాత్రిని పురస్కరించుకుని స్వామివారికి పంచామృత అభిషేకాలు, లలితా పారాయణ, రాత్రికి స్వామివారి ఆలయం వద్ద దీపోత్సవం, 10న రథోత్సవం, స్వామివారి తీర్థం, కోలాటం, 11న శ్రీపుష్పయాగంతో కల్యాణ మహోత్సవాలు ముగుస్తాయని వివరించారు. స్వామివారి కల్యాణోత్సవాల్లో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలవండి



నెల్లిపూడిలో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్న చలమలశెట్టి సునీల్, వరుపుల సుబ్బారావు

- వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంటరీ ఇన్‌చార్జి సునీల్, ప్రత్తిపాడు ఇన్‌చార్జి సుబ్బారావు
- పలు గ్రామాల్లో గడప గడపకూ...

శంఖవరం/రౌతులపూడి: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంటరీ ఇన్‌చార్జి చలమలశెట్టి సునీల్, ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు కోరారు. శంఖవరం మండలం నెల్లిపూడి, సీతంపేట గ్రామాల్లో ఆదివారం వారు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి గడిచిన ఐదేళ్లలో ప్రభుత్వ ప్రభుత్వ పథకాల రూపంలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రభుత్వ పథకాలతో కూడిన కర పత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకే పాలనను తీసుకువచ్చారన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్ సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ నరాల శ్రీను, సర్పంచులు ఈగల విజయదుర్గ, కూనిశెట్టి మాణిక్యం, సకురు గుర్రాజు, ఎంపీటీసీ దడాల సతీష్, కో ఆప్షన్ సభ్యుడు గాబు కృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు గింజాల కొండబాబు, దూడల శివ, కొండపల్లి అప్పారావు, వెలుగుల రవి, యెడ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రౌతులపూడి మండలంలో...

రౌతులపూడి మండలంలోని మల్లంపేటలో ఆదివారం వరుపుల సుబ్బారావు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ పోలుపర్తి తాతాజీ, శంఖవరం ఎంపీపీ పర్వత రాజబాబు, జెడ్పీటీసీ గొల్లు చినదివాణం, పార్టీ నేత వాసిరెడ్డి జమీలు తదితరులతో కలసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరించారు.

ఉప్పంపాలెంలో ఆత్మీయ సమావేశం

మండలంలోని ఉప్పంపాలెంలో సర్పంచ్ యెనుముల కోటిబాబు ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వరుపుల సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంగా పని చేసి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సాయి, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, సర్పంచ్ పోలుపర్తి నూకరత్నం, ఉపసర్పంచ్ రాయపురెడ్డి కన్నబాబు, రాయి ప్రసాద్, జిగిరెడ్డి సత్తిబాబు, సొసైటీ ప్రెసిడెంట్ రుత్తల సత్తిబాబు, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సీహెచ్‌వీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో 100 మంది చేరిక



మల్లిసాలలో పార్టీలో చేరిన వారితో తోట నరసింహం

జగ్గంపేట: గండేపల్లి, జగ్గంపేట మండలాలలకు చెందిన సుమారు 100 మంది టీడీపీ, జనసేన కార్యకర్తలు ఆదివారం మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. మల్లిసాలలోని ఎంపీపీ అత్తులూరి నాగబాబు స్వగృహంలో వైఎస్సార్ సీపీ నేత కాపారపు ప్రసాద్ ఆధ్వర్యంలో జగ్గంపేట పట్టణానికి, గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన నేతలు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి తోట నరసింహం, ఆయన తనయుడు తోట రాంజీ పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికలలో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని తోట నరసింహం సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అత్తులూరి నాగబాబు, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, తోట రాంజీ, వైఎస్సార్ సీపీ నేతలు అత్తులూరి సాయిబాబు, గఫూర్, రావుల గణేష్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేటలో పార్టీ కార్యాలయం ప్రారంభం

జగ్గంపేట–గోకవరం రోడ్డులోని కరుటూరి వీర్రాజు రైసు మిల్లు ఆవరణలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని ఆదివారం పార్టీ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కరుటూరి వీర్రాజు అధ్యక్షతన జరిగిన సభలో వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, అత్తులూరి సాయిబాబు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో జగ్గంపేట నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ హ్యాట్రిక్ కొట్టడం తథ్యమన్నారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయడానికి ప్రతిఒక్కరూ నడుంబిగించాలని సూచించారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే ప్రభుత్వ పాలన

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం
- మల్లిసాలలో గ్రామ సచివాలయ, ఆర్‌బీకే భవనాలు ప్రారంభం



మల్లిసాలలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న కో ఆర్డినేటర్ నరసింహం, ఎంపీపీ నాగబాబు

జగ్గంపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేసి ప్రజల వద్దకే ప్రభుత్వ పాలనను తీసుకువచ్చారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. మండలంలోని మల్లిసాలలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్ల భవనాలను ఎంపీపీ అత్తులూరి నాగబాబుతో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు అవసరమైన అన్నిరకాల సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. మల్లిసాలలో ఒకేసారి ఐదు నూతన ప్రభుత్వ భవనాలను ప్రజలకు అందుబాటులోకి తేవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, యువ నేత తోట రాంజీ, వైఎస్సార్ సీపీ నేతలు అత్తులూరి సాయిబాబు, రావుల గణేష్ రాజా తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయం ఖాయం

- ఆ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం
- కిర్లంపూడిలో ఆత్మీయ సమావేశం



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న తోట నరసింహం

కిర్లంపూడి: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఆ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. కిర్లంపూడిలో పార్టీ మండలాధ్యక్షుడు పెనగంటి రాజేష్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గతంలో తాను ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రిగా ఉన్నప్పుడు కిర్లంపూడిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానన్నారు. మరిన్ని అభివృద్ధి పనులు చేయడానికి మరోసారి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకూ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ యువ నాయకులు తోట రాంజీ, స్థానిక నాయకులు వేగి రామకృష్ణ, పాముల చంటి, అడారి మహేష్, కర్రి వెంకటరమణమూర్తి, దాడి చిన బుజ్జి, దోమాల గంగాధర్, జోకా శ్రీను, వేగి సాంబశివ, పీలా సుబ్బు, అడారి గంగబాబు, ఓలేటి రాజు పాల్గొన్నారు.

సందర్శకులకు బాదం మిల్క్ పంపిణీ



తుని గణపతినగర్ పార్కులో బాదం మిల్క్ పంపిణీ చేస్తున్న వాకర్స్ ప్రతినిధులు

తుని: పట్టణంలోని పొట్టిశ్రీరాములు గణపతినగర్ పార్క్‌కు సందర్శకులు పోటెత్తుతున్నారు. సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన ఈ పార్క్‌ను ఇటీవల మంత్రి దాడిశెట్టి రాజా ప్రారంభించిన విషయం తెలిసిందే. కాగా గణపతినగర్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతకాయల ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం 500 మంది సందర్శకులకు బాదంమిల్క్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి కుచ్చర్లపాటి హరినాథరాజు, ట్రెజరర్ యనమల లక్ష్మణరావు, పల్లెల వీరబాబు, ఉడిపి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు పోలవరం కాలువ గట్టుపై వేంచేసిన కనకదుర్గమ్మ ఆలయం వద్ద ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించారు.

సిద్ధం సభను విజయవంతం చేయండి

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సుబ్బారావు



సమావేశంలో మాట్లాడుతున్న వరుపుల సుబ్బారావు

ప్రత్తిపాడు: గ్రామంలో ఈ నెల 5న నిర్వహించే నియోజకవర్గస్థాయి సిద్ధం సభను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సుబ్బారావు పిలుపునిచ్చారు. స్థానిక లయన్స్‌క్లబ్ కల్యాణ మండపం ఆవరణలో ఆదివారం నియోజకవర్గస్థాయి వైఎస్సార్ కాంతి పథం సభ్యులతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శమన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు గ్రామస్వరాజ్య స్థాపనకు ముఖ్యమంత్రి పాటుపడుతున్నారన్నారు. సంక్షేమ సారథి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. మంగళవారం ప్రత్తిపాడు జాతీయ రహదారిపై ఏర్పాటు చేయనున్న సిద్ధం సభలో మహిళలు భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు, శంఖవరం ఎంపీపీలు గోళ్ల కాంతి సుధాకర్, పర్వత రాజబాబు, ప్రత్తిపాడు, రౌతులపూడి జెడ్పీటీసీలు బెహరా రాజరాజేశ్వరి, గొల్లు చినదివాణం, పార్టీ మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ, పార్టీ నాయకులు అలమండ చలమయ్య, వాసిరెడ్డి జమీలు, బెహరా దొరబాబు, గుడాల వెంకటరత్నం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి, ఏలేశ్వరం అర్బన్ ఏపీఎంలు వై.వెంకట్, ఎ.వెంకటరమణ, ఎం.సరస్వతి, సాయి తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా

పిఠాపురం: పేదల సంపూర్ణ ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత అన్నారు. పిఠాపురంలోని క్యాంపు కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు ఆదివారం ఆమె సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిఠాపురం నియోజకవర్గంలో 13 కుటుంబాలకు చెందిన లబ్ధిదారులకు రూ.16 లక్షల విలువైన సీఎం సహాయ నిధి చెక్‌లను పంపిణీ చేశామన్నారు. ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు, ఆరోగ్య శ్రీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ గీత సూచించారు.

అ'పూర్వ' కలయిక

కోటనందూరు: స్థానిక జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 1999–2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 23 ఏళ్ల తరువాత తాము చదువుకున్న పాఠశాలలోనే కుటుంబ సమేతంగా కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో సందడి చేశారు.

కోటనందూరు హైస్కూల్లో కలిసిన పూర్వ విద్యార్థులు





ప్రత్తిపాడులో చిన్నారులకు చుక్కల మందు వేస్తున్న జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి



కొత్త సూరవరంలో చుక్కల మందు వేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చక్రరావు



ఇర్రిపాకలో చిన్నారులకు చుక్కల మందు వేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



గోకవరంలో చిన్నారికి చుక్కల మందు వేస్తున్న ఎంపీపీ సుంకర శ్రీవల్లి

పోలియో మహమ్మారిని తరిమేద్దాం

- పల్స్ పోలియో విజయవంతం
- పలు గ్రామాల్లో చిన్నారులకు చుక్కల మందు వేసిన ప్రజాప్రతినిధులు

రౌతులపూడి: పోలియో మహమ్మారిని దరి చేరనీయకుండా ప్రతిఒక్కరూ తమ చిన్నారులకు చుక్కల మందు వేయించాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. స్థానిక ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన పల్స్ పోలియో శిబిరంలో ఆదివారం చిన్నారులకు ఆయన చుక్కల మందు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలియో నిర్మూలనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. మండల వ్యాప్తంగా శంఖవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్‌వీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో 29 పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండలంలో 95 శాతం మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్టు ఎంపీహెచ్‌ఈఓ మురళి తెలిపారు. కార్యక్రమంలో శంఖవరం ఎంపీపీ పర్వత రాజబాబు, జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, పార్టీ నాయకుడు వాసిరెడ్డి జమీలు, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, పార్టీ మండల కన్వీనర్ పోలుపర్తి తాతాజీ, కాకి నాని, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇర్రిపాకలో పోలియో చుక్కలు వేసిన ఎమ్మెల్యే చంటిబాబు

జగ్గంపేట: మండలంలోని ఇర్రిపాకలో చిన్నారులకు ఆదివారం ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. పోలియో రహితం సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పల్స్‌పోలియో విజయవంతం

ఏలేశ్వరం: నియోజకవర్గవ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతమైంది. వైద్యారోగ్యశాఖ అధికారులు గ్రామాలు, పట్టణాల్లో ఉదయం నుంచి పోలియో చుక్కలు వేశారు. ఏలేశ్వరం మండలంలోని ప్రభుత్వ వైద్యులు శ్రీలక్ష్మి, పాపారావు ఆధ్వర్యంలో గ్రామాల్లో ప్రధాన కూడళ్లు, బస్టాండ్లు వద్ద వైద్య సిబ్బంది ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. మండలంలో 6099 మంది చిన్నారులకు గాను 5935 మందికి (97.3 శాతం) చుక్కల మందు వేసినట్టు అధికారులు తెలిపారు. మండలంలోని పెద్దనాపల్లిలో చిన్నారులకు ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి పోలియో చుక్కలు వేశారు. తల్లిదండ్రులు తప్పనిసరిగా తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



రౌతులపూడిలో చిన్నారులకు పోలియో డ్రాప్స్ వేస్తున్న వరుపుల సుబ్బారావు

ప్రత్తిపాడు/ ప్రత్తిపాడు రూరల్: మండలవ్యాప్తంగా ఆదివారం వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని రాచపల్లి, పెద్దిపాలెం, శాంతిఆశ్రమం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 63 కేంద్రాల్లో అప్పుడే పుట్టిన చిన్నారుల నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులకు ఆరోగ్య శాఖ సిబ్బంది పోలియో చుక్కలను వేశారు. రాచపల్లి పీహెచ్‌సీ పరిధిలో 3,481 మందికి గాను 3,412 మంది చిన్నారులకు (92 శాతం) పోలియో చుక్కలు వేసినట్టు వైద్యాధికారి డాక్టర్ పవన్‌కుమార్ తెలిపారు. పెద్దిపాలెం పీహెచ్‌సీ పరిధిలో 1625 మందికి, శాంతి ఆశ్రమం పీహెచ్‌సీ పరిధిలో 2241 మందికి పోలియో చుక్కలు వేసినట్లు అధికారులు వివరించారు.

ప్రత్తిపాడులో చిన్నారులకు ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, ఎంపీటీసీ సీంద్రపు భాస్కరరావు తదితరులు పోలియో చుక్కలు వేశారు.

98.7శాతం మందికి పోలియో చుక్కలు

తొండంగి: మండలంలోని ఏవీ నగరంపీహెచ్‌లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని సర్పంచ్ కొయ్యా జగదీశ్వరి ప్రారంభించారు. ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రవికుమార్ మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలో 1962 మంది చిన్నారులకు గాను 1937 మందికి (98.78 శాతం)పోలియో చుక్కలు వేశామన్నారు. మిగిలిన వారికి రెండు రోజుల్లో వైద్యారోగ్యశాఖ సిబ్బంది ఇంటింటా పర్యటించి పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డి.శిరీష, కె.అర్చన, కోసూరు రవి, వైద్యులు పి.భారతి, యువకిషోర్, ఆర్.లలితా కుమారి పాల్గొన్నారు.



పెద్దనాపల్లిలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

97 శాతం పూర్తి

గోకవరం: మండల వ్యాప్తంగా ఆదివారం పల్స్‌పోలియో నిర్వహించారు. మండలంలో 97 శాతం మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సునీల్ తెలిపారు. మండలంలో 6,412 మంది చిన్నారులకు గాను 6,218 మందికి పోలియో చుక్కలు వేశామన్నారు. గోకవరం పంచాయతీ కార్యాలయంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు, సొసైటీ అధ్యక్షుడు దాసరి చినబాబు, నరాలశెట్టి నర్సయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శంఖవరం: స్థానిక పీహెచ్‌సీలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఎంపీపీ పర్వత రాజబాబు ప్రారంభించారు. పలువురు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

పిల్లల ఆరోగ్యమే లక్ష్యం

కిర్లంపూడి: పిల్లల ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. వీరవరం పీహెచ్‌సీలో పలువురు చిన్నారులకు ఆదివారం ఆయన పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ ఆఫీసర్ వి.అరుణ మాట్లాడుతూ మండలంలోని మూడు పీహెచ్‌సీల పరిధిలో 90 శాతం మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు.

తుని: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి ప్రారంభించారు. 100 శాతం చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. తుని ఏరియా ఆసుపత్రిలో నిర్వహించిన పల్స్ పోలియోలో రోటరీ క్లబ్ ప్రతినిధులు సేవలందించారు. పల్స్ పోలియో విధుల్లో ఉన్న 180 మంది వైద్య సిబ్బందికి రోటరీ ప్రతినిధులు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు వర్మ, కార్యదర్శి కిషోర్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గండేపల్లి: పోలియో రహిత సమాజానికి కృషి చేద్దామని ఎంపీపీ చలగళ్ల దొరబాబు పిలుపునిచ్చారు. మండలంలోని మురారిలో పల్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. పలువురు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. గండేపల్లిలో పల్స్‌పోలియోను వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, గ్రామ సర్పంచ్ రుత్తల లలిత ప్రారంభించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ పి.సరిత పల్స్ పోలియోను తనిఖీ చేశారు. గండేపల్లి పీహెచ్‌సీ పరిధిలో 3338 మందికి గాను 98 శాతం మంది చిన్నారులకు చుక్కల మందు వేసినట్టు అధికారులు తెలిపారు.

97.80 శాతం మందికి పోలియో చుక్కలు

తుని రూరల్: మండలంలోని తేటగుంట, ఎస్.సూరవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 97.80 శాతం మంది చిన్నారులకు ఆదివారం పోలియో చుక్కలు వేసినట్టు వైద్యాధికారులు తెలిపారు. తేటగుంట పీహెచ్‌సీ పరిధిలో 3576 మందికిగాను 3512 మందికి, ఎస్.సూరవరం పీహెచ్‌సీ పరిధిలో 2982 మందికి గాను 2902 మందికి పోలియో నివారణ వ్యాక్సిన్ వేశామన్నారు. మొత్తం 57 కేంద్రాల్లో 97.80 శాతం పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్టు డాక్టర్లు సాహిత, సౌమ్య వివరించారు. కొత్త సూరవరంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంటా చక్రరావు పల్స్ పోలియోను ప్రారంభించారు. చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

డీఐఓ ఆకస్మిక తనిఖీ




ఏవీ నగరంలో పిల్లలకు పోలియో చుక్కలు వేసిన జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రత్నకుమార్

తొండంగి: ఏవీ నగరం పీహెచ్‌సీని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి (డీఐఓ) డాక్టర్ కె.రత్నకుమార్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యాధికారి పి.రవి కుమార్, ఇతర సిబ్బందితో మాట్లాడారు. పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. పల్స్ పోలియో నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కాకినాడ హోప్ ఐలాండ్‌లో 25 మంది పిల్లలున్నారని, వారికి కూడా వైద్య, ఆరోగ్య సిబ్బంది సోమవారం వెళ్లి పోలియో చుక్కలు వేస్తారన్నారు. జిల్లా లెప్రసీ అధికారి, పల్స్‌పోలియో పర్యవేక్షకులు పి.రమేష్ కూడా పల్స్‌పోలియో కార్యక్రమాన్ని పరిశీలించారు.

మహిళపై కర్రతో దాడి

గండేపల్లి: మండలంలోని మల్లేపల్లిలో నిద్రిస్తున్న మహిళపై కర్రతో గుర్తు తెలియని వ్యక్తి దాడి చేసి గాయపరిచాడు. వివరాల్లోకి వెళితే...మల్లేపల్లి గ్రామానికి చెందిన ఆలేటి రామకృష్ణ, లక్ష్మి దంపతులు శనివారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి లక్ష్మి తలపై కర్రతో బలంగా కొట్టాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెల్లపు ఊట ధ్వంసం



వేమవరంలో సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్న ఎస్ఈబీ సిబ్బంది

తుని: సారా బట్టీలపై దాడి చేసి బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు స్థానిక ఎస్ఈబీ ఇన్‌చార్జ్ ఎస్‌హెచ్ఓ పి.చిట్టిబాబు ఆదివారం తెలిపారు. తొండంగి మండలం వేమవరంలో సారా బట్టీలపై దాడులు నిర్వహించి సారా తయారీకి సిద్ధం చేసిన 2,800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. సంఘటన స్థలం నుంచి 45 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. తొండంగి మండలం తమ్మయ్యపేటలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న వ్యక్తి నుంచి 14 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తుని ఎస్ఈబీ అధికారులు తెలిపారు.